అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 331 | వరంగల్ | శనివారం, 10 అక్టోబర్ 2026 | పేజీలు: 06







తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా జరుపుకునే పండుగలో మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ వైభవంగా ప్రారంభం అయింది. పల్లెలు, నగరాలలో మహిళలు బతుకమ్మ ఆడారు. ఆలయాలు, చెరువులు, కుంటల వద్ద సందడి నెలకొంది. వరంగల్ మహానగరంలోని పద్మాక్షి దేవాలయం, వేయి స్తంభాల ఆలయం, వడ్డేపల్లి, బంధం చెరువు వంటి ప్రాంతాల్లో మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మతో మహిళలు, పిల్లలు సందడి చేశారు. తంగేడు పూల వనం నగరం చేరిన రీతిలో బతుకమ్మ పండుగ వాడవాడలా కనువిందు చేసింది. అందరూ ఒక చోట చేరి ఆప్యాయంగా పలకరించుకున్నారు. గుంపులుగా చేరి బతుకమ్మ పాటలు పాడారు. - అక్షరశక్తి, హనుమకొండ

బతుకమ్మ సంబురం

తొమ్మిది రోజుల వేడుకలు ప్రారంభం

తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సందడి

ఆడిపాడిన ఆడబిడ్డలు

వర్ణ శోభితమైన పల్లెపట్నం

5

కామేశ్వరాలయ పునర్నిర్మాణానికి జియోటెక్నికల్ పరిశోధనలు

రూ.2.89 కోట్లతో పునాది పనులు పూర్తి.. రూ.6.89 కోట్ల నిర్మాణ పనులకు టెండర్ల పరిశీలన







ములుగు జిల్లా పాలంపేటలోని ప్రపంచ వారసత్వ సంపద రామప్ప దేవాలయ ప్రాంగణంలో ఉన్న కామేశ్వరాలయ పునర్నిర్మాణానికి సంబంధించి జియోటెక్నికల్ పరిశోధనలు నిర్వహించారు. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) హైదరాబాద్ సర్కిల్ సాంకేతిక బృందం, హైదరాబాద్‌కు చెందిన ఎంటీఎల్ఎస్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్ఐటీ వరంగల్‌కు చెందిన ప్రముఖ విశ్రాంత భూసాంకేతిక నిపుణుల భాగస్వామ్యంతో ఈ పరిశోధనలు చేపట్టారు. - అక్షరశక్తి, పాలంపేట

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం పొందేందుకు వచ్చిన రోగులకు నిరీక్షణ తప్పడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హనుమకొండ జిల్లాలోని రోహిణి ఆసుపత్రిలో ఆరోగ్యమిత్ర, ఆరోగ్యశ్రీ సిబ్బంది, డ్యూటీ డాక్టర్ కోసం రోగులు గంటల కొద్ది వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని సమాచారం. వైద్యసేవల కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు గంటల తరబడి ఎదురుచూడాల్సి రావడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. - అక్షరశక్తి, హనుమకొండ

ఆరోగ్యశ్రీపై అలసత్వం..!

- హనుమకొండ రోహిణి ఆసుపత్రిలో రోగుల పడిగాపులు!
- ఆరోగ్యమిత్ర, ఆరోగ్యశ్రీ సిబ్బంది, డ్యూటీ డాక్టర్ కోసం రోగుల నిరీక్షణ..
- పేదల వైద్య సేవలపై పర్యవేక్షణ శూన్యం



4

నేడు హుజూరాబాద్‌లో బాలగోపాల్ సంస్మరణ సభ

నేటి సందర్భంలో హక్కుల దృక్పథంపై చర్చ



అక్షరశక్తి, హుజూరాబాద్: ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త, న్యాయవాది, తాత్వికుడు బాలగోపాల్ 17వ సంస్మరణ సభను ఆదివారం నిర్వహించనున్నారు. 'నేటి సందర్భానికి బాలగోపాల్ హక్కుల దృక్పథం' అనే అంశంపై ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హుజూరాబాద్‌లోని వీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్ (హుజూరాబాద్ క్లబ్)లో సభ జరగనుంది. మానవ హక్కుల వేదిక, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయవాది, సామాజిక కార్యకర్త, 'ఇండియాస్ ఫర్గాటెన్ కంట్రీ' పుస్తక రచయిత్రి బేలా భాటియా ముఖ్య వక్తగా హాజరుకానున్నారు. ప్రజా సంఘాలు, మానవ హక్కుల వేదిక నాయకులు కూడా ప్రసంగించనున్నారు. మూడున్నర దశాబ్దాల పాటు హక్కుల రంగంలో కార్యకర్తగా, నాయకుడిగా, తాత్వికుడిగా బాలగోపాల్ రెండు తెలుగు రాష్ట్రాల్లో సామాజిక స్పృహ కలిగిన ప్రజలకు సుపరిచితులని నిర్వాహకులు తెలిపారు. ఉద్యమకారులకు ఆయన మానసిక, నైతిక స్థైర్యాన్ని అందించారని పేర్కొన్నారు. 2009 అక్టోబరు 8న ఆయన ఆకస్మిక మరణం తర్వాత కూడా, ప్రజా హక్కుల రంగంలో ఆయన లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సహజ వనరులను కొందరి ప్రయోజనాలకు వినియోగించడం, పర్యావరణాన్ని ధ్వంసం చేయడం, విద్యారంగంలో కోట్లాది మంది పిల్లల భవిష్యత్తును నిర్లక్ష్యం చేయడం, చట్టం ముందు సమానత్వాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం వంటి పరిణామాలు హక్కుల ఉల్లంఘనలేనని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రభుత్వం చేయకూడని పనులు చేయడం మాత్రమే కాకుండా, రాజ్యాంగబద్ధంగా చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, అసమానతల నిర్మూలన చర్యలను చేపట్టకపోవడం కూడా హక్కుల ఉల్లంఘనేనని బాలగోపాల్ దృక్పథం స్పష్టం చేస్తోందన్నారు. హక్కులు పాలకుల దయాదాక్షిణ్యాలతో లభించినవి కావని, అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడి సాధించుకున్నవని తెలిపారు. పాలకుల్లో జవాబుదారీతనాన్ని, సమాజంలో ప్రజాస్వామిక సంస్కృతిని పెంపొందించడంలో హక్కుల భావన కీలకమని బాలగోపాల్ విశ్వసించారని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక, అధికార, న్యాయ వ్యవస్థల పనితీరు నేపథ్యంలో ప్రజా హక్కుల సమస్యలను మరోసారి చర్చించి, ఆయన ఆశయాలను స్మరించుకోవడమే సభ ఉద్దేశమని వెల్లడించారు. సభకు ప్రజాస్వామిక, సామాజిక స్పృహ కలిగిన వారందరూ హాజరుకావాలని నిర్వాహకులు ఆహ్వానించారు. కార్యక్రమ నిర్వహణలో మానవ హక్కుల వేదికకు చెందిన న్యాయవాది వి.సుధాకర్‌రెడ్డి, తెలంగాణ జన సమితి నాయకుడు, న్యాయవాది ముక్కెర రాజు, భారత్ బచావోకు చెందిన భీమోజు సదానందం, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, రచయిత ఇమ్మడి సంపత్‌కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వేల్పుల రత్నం, తెలంగాణ హమాలి వర్కర్స్ యూనియన్‌కు చెందిన గుంటి సామ్రాజ్యం, ద్రవిడ సాహిత్య సాంస్కృతిక కళామండలికి చెందిన రామంచ భరత్ తదితరులు పాల్గొంటున్నారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైల బదిలీలు



అక్షరశక్తి, హన్మకొండ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లను (ఎస్సైలు) బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా కారణాలతో తక్షణమే అమల్లోకి వచ్చేలా ఈ బదిలీలు చేపట్టారు. ఈ మేరకు 2026 అక్టోబర్ 10న జారీ చేసిన ఉత్తర్వుల్లో భాగంగా ఎస్సైల ప్రస్తుత విధులు, కొత్త పోస్టింగ్‌లను పేర్కొన్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్‌ల అధికారులు బదిలీ అయిన ఎస్సైలను వెంటనే రిలీవ్ చేసి, కొత్త స్థానాల్లో బాధ్యతలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బండి శ్రవణ్ కుమార్ - చిల్పూర్ పీఎస్, సిరిపురం నవీన్ కుమార్ - హనుమకొండ పీఎస్, కల్తి కిషోర్ - లింగాల ఘన్‌పూర్ పీఎస్, దూదిమెట్ల నరేష్ - వెలైర్ పీఎస్, మషిరెడ్డి మహేందర్ - దుగ్గొండి పీఎస్, బొల్లం వినయ్ కుమార్ - జఫర్‌గఢ్ పీఎస్, బోగం ప్రవీణ్ - వర్ధన్నపేట పీఎస్, ఎన్. సాయిబాబు - మిల్స్ కాలనీ పీఎస్, మొత్తం ఉత్తర్వుల్లో 35 మంది ఎస్సైల బదిలీ, పోస్టింగ్‌ల వివరాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు రిలీవింగ్, జాయినింగ్ తేదీలను పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి తెలియజేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జనగామ జిల్లా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను

ఘనంగా నిర్వహించాలి

- **మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**



అక్షరశక్తి, దేవరుప్పుల: జనగామ జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న వారు దేవరుప్పుల మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించాలని సూచించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందని వారు పేర్కొన్నారు. జనగామ జిల్లా ఏర్పాటుతో ఈ ప్రాంతం అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. నూతన జిల్లా కార్యాలయం, వైద్య కళాశాల, మాతా శిశు ఆసుపత్రితో పాటు వల్మిడి, బమ్మెర పోతన, పాలకుర్తి సోమేశ్వర స్వామి ఆలయం, జిడికల్ దేవాలయం వంటి ప్రాంతాల అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి, గతంలో కరవు పరిస్థితులు ఎదుర్కొన్న జనగామ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించే ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ మూడేళ్ల పాలనలో రాష్ట్రం వెనుకబడిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చి, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను మళ్లీ అభివృద్ధి పథంలో నడిపిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి కోర్సులతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

ప్రొఫెసర్ బానోత్ ధర్మానాయక్





అక్షరశక్తి, హనుమకొండ: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నూతన నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెడుతూ, ప్రముఖ బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటూ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందని యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బానోత్ ధర్మానాయక్ తెలిపారు. హనుమకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కౌన్సిలర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య గంటా చక్రపాణి విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యమిస్తూ, ముఖ్యంగా నిరుపేద, గ్రామీణ, అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని ధర్మానాయక్ వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించడం, వారిని ఉపాధికి సంసిద్ధులను చేయడం యూనివర్సిటీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకోసం పలు బహుళజాతి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు, వాటి ద్వారా విద్యార్థులకు లభించే ఉపాధి అవకాశాల గురించి వివరించారు. విద్యార్థులకు యూనివర్సిటీ అందిస్తున్న విద్యా, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై కౌన్సిలర్లు అవగాహన కల్పించాలని, ఉన్నత విద్యతోపాటు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా వారికి దిశానిర్దేశం చేయాలని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ బానోత్ ధర్మానాయక్‌ను నిర్వాహకులు సన్మానించారు.
ఈ కార్యక్రమంలో కాకతీయ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనాథ్, ప్రొఫెసర్ యాకూబ్, ప్రొఫెసర్ చిన్న, అధ్యయన కేంద్రాల కౌన్సిలర్లు డాక్టర్ సదానందం, డాక్టర్ పూర్ణ, డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ రాజునాయక్, డాక్టర్ రమేష్ రెడ్డి, డాక్టర్ సంజీవ్, డాక్టర్ రాజన్న, కృష్ణవేణి, కుమారస్వామి, సుధాకర్, స్వరూప, సుమన్, డాక్టర్ వెంకట్, డాక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యయన కేంద్రం ఇన్‌చార్జి వేణుగోపాల్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం



అక్షరశక్తి, వరంగల్: లారీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అవయవాలు కోల్పోయిన ముదిరాజ్ కుటుంబానికి పీఆర్ ముదిరాజ్ సేవా సమితి అండగా నిలిచింది. నెల రోజుల క్రితం జరిగిన లారీ ప్రమాదంలో చికురాయి గ్రామానికి చెందిన పినికాశి సతీష్ ముదిరాజ్ కుటుంబ సభ్యులు స్వప్న, విక్కీ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో స్వప్న ఒక కాలును, విక్కీ ఒక చేతిని కోల్పోయారు. పీఆర్ ముదిరాజ్ సేవా సమితి సేవకులు జీర్ర కుమార్, పిట్టల మౌనిక ఇచ్చిన సమాచారంతో 56 మంది దాతలు అందించిన సహకారంతో బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు. సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పెసరు రాజన్న ఆధ్వర్యంలో స్థానిక గ్రామ సర్పంచ్ ఓదెలు శ్రీనివాస్ ముదిరాజ్, కుల పెద్దలు పిడుగు రవీందర్, కిసరి నర్సయ్య తదితరుల సమక్షంలో ఈ సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పెసరు రాజన్న మాట్లాడుతూ పేద ముదిరాజ్ కుటుంబాలు ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడమే పీఆర్ ముదిరాజ్ సేవా సమితి లక్ష్యమన్నారు. చదువుకోలేని విద్యార్థులకు, కుటుంబంలో పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలకు, అనారోగ్యంతో బాధపడుతున్న ముదిరాజ్ కుటుంబ సభ్యులకు వివిధ సేవా కార్యక్రమాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర నాయకుడు సింగారపు రామకృష్ణ, హనుమకొండ జిల్లా బాధ్యుడు అమ్మగారి శ్యామ్, వరంగల్ జిల్లా బాధ్యులు జీర్ర కుమార్, తాళ్ల రవీందర్, ఓరుగంటి తిరుపతి, సిద్దిపేట జిల్లా బాధ్యుడు బైరి యాదగిరి, ముదిరాజ్ సేవకుడు దండు చిరంజీవి, చికురాయి గ్రామ సర్పంచ్ ఓదెలు శ్రీనివాస్, కుల పెద్దలు పిడుగు రవీందర్, కిసరి నర్సయ్య, స్వామి రాజన్న, సాంబయ్య, పిట్టల మౌనిక, లక్ష్మీ, పినికాశి లింగయ్య, బయ్య మల్లయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంద ఊర చెరువు మరమ్మతు పనులకు శంకుస్థాపన

- **రైతులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలి – ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



అక్షరశక్తి, వర్ధన్నపేట: మండలంలోని ఇల్లంద గ్రామ ఊర చెరువు కట్ట మరమ్మతు, అభివృద్ధి పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శనివారం శంకుస్థాపన చేశారు. రూ.41.85 లక్షల నిధులతో చేపట్టనున్న ఈ పనుల ద్వారా చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టి, చెరువు అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు వ్యవసాయానికి ఎంతో కీలకమని, వాటి సంరక్షణతో రైతులకు సాగునీటి అవసరాలు తీరడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు దోహదపడుతుందని తెలిపారు. చెరువు కట్ట మరమ్మతు పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ముఖ్యంగా సాగునీటి కాలువల ద్వారా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, అవసరమైన సమన్వయంతో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కాలువలు, ఇతర సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పోశాల వెంకన్న, మాజీ మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పావని ఏకాంతం, వర్ధన్నపేట పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్, ఇల్లంద గ్రామ శాఖ అధ్యక్షులు ఎద్దు రాజేంద్రప్రసాద్, మండల బ్లాక్ అధ్యక్షురాలు సునీత గౌడ్, సీనియర్ నాయకులు సాయి కుమార్, స్వామి, బుచ్చిమల్లు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి

- **ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులకు కవిత పిలుపు**



అక్షరశక్తి, మహబూబాబాద్, అక్టోబర్ 10: నల్గొండ, వరంగల్ ,ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కవిత పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదును విస్తృతంగా చేపట్టి, ఇతర పార్టీల కంటే అధిక సంఖ్యలో పట్టభద్రులను నమోదు చేయించేలా కృషి చేయాలని సూచించారు. ఈ మేరకు శనివారం మహబూబాబాద్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరత కారణంగా విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోందని, దీనివల్ల విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో కవిత స్వయంగా తొలి పట్టభద్రుల ఓటరు నమోదును చేసుకున్నారు. సమావేశంలో పాల్గొన్న మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యుడు డాక్టర్ బోడ అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు శాసన సభ నియోజకవర్గాల్లో పట్టభద్రుల ఓటరు నమోదును పెద్ద ఎత్తున చేపడతామని తెలిపారు. నిరుద్యోగులు, ఉద్యోగులకు న్యాయం జరిగేలా పార్టీ తరపున ప్రత్యేక ఎన్నికల ప్రణాళికను విడుదల చేయాలని కవితను కోరినట్లు చెప్పారు. నాయకులందరూ సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జి బిక్షపతి, వెలిగేటి రవి, సీనియర్ నాయకులు శ్రీకాంత్ గౌడ్, శ్రీశైలం, హర్షిత్, రాము, సంతోష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగులది వసుదైక కుటుంబం

- **AIGDSU జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు**
- **గ్రామీణ తపాలా ఉద్యోగి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేత**



అక్షరశక్తి, ఏటూరునగరం: అనారోగ్యంతో మృతి చెందిన గ్రామీణ తపాలా ఉద్యోగి సాధిక్ పాషా కుటుంబానికి హనుమకొండ జీడీఎస్ కోఆపరేటివ్ సొసైటీ తరపున రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఉద్యోగి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందించినట్లు సొసైటీ అధ్యక్షుడు, అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు తెలిపారు. హనుమకొండ పోస్టల్ డివిజన్ పరిధిలోని పస్రా సబ్ పోస్టాఫీస్‌లో గ్రామీణ తపాలా ఉద్యోగిగా పనిచేస్తున్న సాధిక్ పాషా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితిని గుర్తించిన హనుమకొండ జీడీఎస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు కుటుంబానికి సహాయం అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం పస్రా సబ్ పోస్టాఫీస్‌లో పోస్టల్ సిబ్బంది సమక్షంలో సాధిక్ పాషా భార్య కైరున్నిసా బేగంకు రూ.50 వేల చెక్కును బొద్దున వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తపాలా ఉద్యోగులది వసుదైక కుటుంబమని, ఒక ఉద్యోగి కుటుంబానికి కష్టకాలం ఎదురైనప్పుడు తోటి ఉద్యోగులు అండగా నిలవడం తమ బాధ్యతని పేర్కొన్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల కుటుంబాలకు అవసరమైన సమయంలో తోడ్పాటు అందించాలనే లక్ష్యంతోనే హనుమకొండ జీడీఎస్ కోఆపరేటివ్ సొసైటీ పనిచేస్తోందని తెలిపారు. ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, కష్ట సమయంలో వారికి అండగా ఉన్నామనే ధైర్యాన్ని అందించడం ఈ సహాయం ఉద్దేశమని పేర్కొన్నారు. డివిజన్‌లోని ప్రతి ఒక్కరూ కోసపరేటివ్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ పెరుమాండ్ల తిరుపతి, అజీజ్ పాషా, పి.శ్రీలత, పస్రా సబ్ పోస్టుమాస్టర్ రమేష్, ఇ.సందీప్, విజయశ్రీ, సయ్యద్ వహీద్, సీహెచ్.సాంబయ్య, సీహెచ్.రాహుల్, పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌ను అవమానించడం కాంగ్రెస్ పతనానికి నాంది: చల్లా ధర్మారెడ్డి

అక్షరశక్తి, హనుమకొండ: తెలంగాణను పదేళ్ల పాలనలో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. తెలంగాణ జిల్లాల ఏర్పాటు దశాబ్ది సందర్భంగా శనివారం హనుమకొండలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు పార్టీ శ్రేణులతో కలిసి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి, అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడం, 33 జిల్లాల ఏర్పాటు, రైతుబంధు, రైతుబీమా, నాణ్యమైన విద్యుత్ సరఫరా, కాళేశ్వరం ప్రాజెక్టు వంటి కార్యక్రమాలతో కేసీఆర్ తెలంగాణ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ల సహకారంతో పరకాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని చల్లా ధర్మారెడ్డి తెలిపారు. ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన పరకాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, దామెర, నడికుడ నూతన మండలాల ఏర్పాటు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ద్వారా యువతకు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేశామని చెప్పారు. హనుమకొండలో 1000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంతో పాటు విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యమిచ్చామని పేర్కొంటూ, బీఆర్ఎస్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు ఎంతో వ్యత్యాసం ఉందని విమర్శించారు.

గ్రామీణ తపాలా ఉద్యోగులది వసుదైక కుటుంబం

- **AIGDSU జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు**
- **గ్రామీణ తపాలా ఉద్యోగి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేత**



అక్షరశక్తి, ములుగు : అనారోగ్యంతో మృతి చెందిన గ్రామీణ తపాలా ఉద్యోగి సాధిక్ పాషా కుటుంబానికి హనుమకొండ జీడీఎస్ కోఆపరేటివ్ సొసైటీ తరపున రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఉద్యోగి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సహాయాన్ని అందించినట్లు సొసైటీ అధ్యక్షుడు, అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు తెలిపారు. హనుమకొండ పోస్టల్ డివిజన్ పరిధిలోని పస్రా సబ్ పోస్టాఫీస్‌లో గ్రామీణ తపాలా ఉద్యోగిగా పనిచేస్తున్న సాధిక్ పాషా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితిని గుర్తించిన హనుమకొండ జీడీఎస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు కుటుంబానికి సహాయం అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం పస్రా సబ్ పోస్టాఫీస్‌లో పోస్టల్ సిబ్బంది సమక్షంలో సాధిక్ పాషా భార్య కైరున్నిసా బేగంకు రూ.50 వేల చెక్కును బొద్దున వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తపాలా ఉద్యోగులది వసుదైక కుటుంబమని, ఒక ఉద్యోగి కుటుంబానికి కష్టకాలం ఎదురైనప్పుడు తోటి ఉద్యోగులు అండగా నిలవడం తమ బాధ్యతని పేర్కొన్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల కుటుంబాలకు అవసరమైన సమయంలో తోడ్పాటు అందించాలనే లక్ష్యంతోనే హనుమకొండ జీడీఎస్ కోసపరేటివ్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ పెరుమాండ్ల తిరుపతి, అజీజ్ పాషా, పి.శ్రీలత, పస్రా సబ్ పోస్టుమాస్టర్ రమేష్, ఇ.సందీప్, విజయశ్రీ, సయ్యద్ వహీద్, సీహెచ్.సాంబయ్య, సీహెచ్.రాహుల్, పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

అక్షరశక్తి, భూపాలపల్లి : రానున్న దసరా పండుగ సెలవుల నేపథ్యంలో జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రజలు పెద్ద సంఖ్యలో తమ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు ప్రయాణాలు చేయనున్నందున, ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, దసరా పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, కాలనీలు, ఒంటరిగా ఉన్న ఇళ్ల పరిసరాల్లో పోలీస్ గస్తీని మరింత పటిష్టం చేసినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ, బీట్ పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసి, అనుమానాస్పద వ్యక్తులు, కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు ప్రయాణానికి వెళ్లే ముందు ఇళ్లకు బలమైన తాళాలు వేసుకోవాలని, విలువైన వస్తువులు, నగదు, బంగారం వంటి వాటిని ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. అలాగే, తాము ఊరికి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి, గ్రామ పెద్దలకు తెలియజేయడంతో పాటు, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌కు ముందుగానే సమాచారం అందించాలని తెలిపారు. దసరా సెలవుల సమయంలో దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, ద్విచక్ర వాహనాల చోరీలు, ఇళ్లలోకి చొరబడి నేరాలకు పాల్పడే ప్రయత్నాలను అడ్డుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ గారు తెలిపారు. గతంలో నేరాలు నమోదైన ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, పోలీస్ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసినట్లు వెల్లడించారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని, ఇంటి తాళాల వివరాలు, ప్రయాణ వివరాలను సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల కదలికలు లేదా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రాధాన్యత. పండుగ సెలవులను సురక్షితంగా జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ విజ్ఞప్తి చేశారు.



ఆరోగ్యశ్రీ పై అలసత్వం..!

- **హనుమకొండ రోహిణి ఆసుపత్రిలో రోగుల పడిగాపులు!**
- **ఆరోగ్యమిత్ర, ఆరోగ్యశ్రీ సిబ్బంది, డ్యూటీ డాక్టర్ కోసం రోగుల నిరీక్షణ..**
- **పేదల వైద్య సేవలపై పర్యవేక్షణ శూన్యం**





అక్షరశక్తి, హనుమకొండ; పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం పొందేందుకు వచ్చిన రోగులకు నిరీక్షణ తప్పడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హనుమకొండ జిల్లాలోని రోహిణి ఆసుపత్రిలో ఆరోగ్యమిత్ర, ఆరోగ్యశ్రీ సిబ్బంది, డ్యూటీ డాక్టర్ కోసం రోగులు గంటల కొద్ది వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని సమాచారం. వైద్యసేవల కోసం ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులు గంటల తరబడి ఎదురుచూడాల్సి రావడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యం కోసం వస్తే.. నిరీక్షణేనా?

అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందడం అత్యంత కీలకం. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందేందుకు వచ్చే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆసుపత్రి సిబ్బంది అందుబాటులో ఉండటం ఎంతో అవసరం. అయితే రోహిణి ఆసుపత్రిలో సంబంధిత సిబ్బంది, డ్యూటీ డాక్టర్ కోసం రెండు గంటలకు పైగా వేచి ఉండాల్సి వస్తోందన్న సమాచారం రోగుల ఇబ్బందులను వెలుగులోకి తెస్తోంది. ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నవారు, వారితో వచ్చిన కుటుంబ సభ్యులు ఎవరిని సంప్రదించాలో తెలియక నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యమిత్ర సేవలు ఎక్కడ?

ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొందే రోగులకు అవసరమైన సమాచారం అందించడం, పథకానికి సంబంధించిన ప్రక్రియలో సహకరించడం వంటి బాధ్యతల్లో ఆరోగ్యమిత్ర విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. అలాంటి విభాగం అందుబాటులో లేకపోయినా, సేవలు ఆలస్యమైనా రోగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆరోగ్యశ్రీకి సంబంధించిన ప్రక్రియ కోసం ఎవరిని సంప్రదించాలి? తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలి? అనే అయోమయం రోగుల్లో నెలకొనే అవకాశం ఉంది. రోగులకు మార్గనిర్దేశం చేయాల్సిన సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉండేలా ఆసుపత్రి యాజమాన్యం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

డ్యూటీ డాక్టర్ కోసం ఎదురు చూపులు...

ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండటం రోగుల వైద్య అవసరాలకు అత్యంత ప్రాధాన్యమైన అంశం. వైద్యుడి కోసం రెండు గంటలకు పైగా వేచి ఉండాల్సి వస్తే రోగులు పడే ఇబ్బందులు చెప్పనలవి కావు. ముఖ్యంగా అత్యవసర వైద్య అవసరాలు ఉన్న వారి విషయంలో అలసత్వం తీవ్ర సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. అందువల్ల డ్యూటీ వైద్యుల విధుల నిర్వహణ, అందుబాటు సమయాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పర్యవేక్షణ ఏదీ??

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం అమలు, రోగులకు అందుతున్న సేవలపై సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉంది. రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయి? సంబంధిత సిబ్బంది నిర్దిత సమయాల్లో విధుల్లో ఉంటున్నారా? డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండేలా ఎలాంటి ఏర్పాట్లు ఉన్నాయి? అనే అంశాలపై అధికారులు విచారణ జరిపి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలి. ప్రభుత్వం పేదలకు వైద్యభారాన్ని తగ్గించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తుంటే, ఆసుపత్రుల్లో సేవల కోసం రోగులు నిరీక్షించాల్సి రావడం ఆ పథకం ఉద్దేశానికి విరుద్ధంగా మారే ప్రమాదం ఉంది. రోహిణి ఆసుపత్రిలో రోగులకు ఎదురవుతున్న ఇబ్బందులపై యాజమాన్యం స్పందించి, ఆరోగ్యమిత్ర, ఆరోగ్యశ్రీ సిబ్బంది, డ్యూటీ డాక్టర్ అందుబాటును నిర్ధారించాలని రోగులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు కూడా ఈ వ్యవహారంపై దృష్టి సారించి, రోగులకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

క్షీరాభిషేకాలు కాదు ధర్మారెడ్డి..

- **పరకాలకు జిల్లా హోదా ఎందుకు తేలేదో చెప్పు**
- **పరకాల ప్రజలకు చేసిన అన్యాయంపై మాట్లాడాలి**
- **బీజేపీ నాయకుడు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు**
- **పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన**

అక్షరశక్తి, పరకాల : పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించకుండా, జిల్లా హోదా కల్పించకుండా అన్యాయం చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి అమరధామం వరకు వినూత్న నిరసన ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, పరకాలకు జిల్లా హోదా కల్పించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని నిరసించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ప్రత్యేక స్థానం కలిగిన పరకాలను అమరవీరుల జిల్లాగా ప్రకటించాలన్న ప్రజల ఆకాంక్షను గత బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి, పరకాల ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన చల్లా ధర్మారెడ్డి ఈ ప్రాంతానికి జిల్లా హోదా సాధించడంలో ఎందుకు విఫలమయ్యారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదేళ్ల పాలనలో పరకాలకు జిల్లా హోదా తీసుకురాలేకపోయిన చల్లా ధర్మారెడ్డి, ఇప్పుడు ఏం సాధించామని పాలాభిషేకాల రాజకీయాలు చేస్తున్నారు? అని ప్రశ్నించారు. పరకాలకు జరిగిన అన్యాయంపై సమాధానం చెప్పకుండా రాజకీయ ఆర్భాటాలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు.

పరకాల ప్రజలకు కావాల్సింది పాలాభిషేకాలు, రాజకీయ ప్రచారాలు కాదని, అమరవీరుల చరిత్రకు తగిన గుర్తింపు, జిల్లా హోదా, పట్టణ సమగ్ర అభివృద్ధి అని స్పష్టం చేశారు. పరకాల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు, అమరవీరుల త్యాగాలకు తగిన గుర్తింపు సాధించేందుకు బీజేపీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో పరకాల మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కల విజయకుమార్, బెజ్జంకి పూర్ణ చారి, ఆకుల లావణ్య శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఆర్పి జయంతి లాల్, దేవునూర్ మేఘనాథ్, జిల్లా కోశాధికారి ఎర్రం రామన్న,మండల అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్, నడికూడా మండల అధ్యక్షులు ఎరుకల దివాకర్,పట్టణ ప్రధాన కార్యదర్శులు సంఘు పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి,గుండె బోయిన నర్సయ్య, ఓబీసీ మచ్చ జిల్లా అధికార ప్రతినిధి ఉడుత చిరంజీవి, దళిత మోర్చా ఉపాధ్యక్షులు దుబాసి కృష్ణ ప్రసాద్, నాయకులు మార్త రాజభద్రయ్య, సాదా మధుకర్, దంచనాధుల సత్యనారాయణ, దంచనాదుల కిరణ్,పిట్ట కిషోర్, ముత్యాల దేవేందర్, ఆకుల రాంబాబు, సారంగ నరేష్, పైండ్ల రంజిత్, తడక పూర్ణచందర్, దయ్యాల దేవరాజ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కొలను పాక రేవంత్ సిద్దు, మాచబోయిన క్రాంతి, కక్కు రాజు, జనగాం రాజు, యాదవ్, రసమల్ల నవీన్, దుమల నగేష్, రేగురి శశిధర్ రెడ్డి, మార్క అజయ్ తదితరులు పాల్గొన్నారు.















బతుకమ్మ సంబురం

తొమ్మిది రోజుల వేడుకలు ప్రారంభం

తొలి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సందడి

ఆడిపాడిన ఆడబిడ్డలు.. వర్ణ శోభితమైన పల్లెపట్నం






తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా జరుపుకునే పండుగలో మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ వైభవంగా ప్రారంభం అయింది. పల్లెలు, నగరాలలో మహిళలు బతుకమ్మ ఆడారు. ఆలయాలు, చెరువులు, కుంటల వద్ద సందడి నెలకొంది. వరంగల్ మహానగరంలోని పద్మాక్షి దేవాలయం, వేయి స్తంభాల ఆలయం, వడ్డేపల్లి, బంధం చెరువు వంటి ప్రాంతాల్లో మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మతో మహిళలు, పిల్లలు సందడి చేశారు. తంగేడు పూల వనం నగరం చేరిన రీతిలో బతుకమ్మ పండుగ వాడవాడలా కనువిందు చేసింది. అందరూ ఒక చోట చేరి ఆప్యాయంగా పలకరించుకున్నారు. గుంపులుగా చేరి బతుకమ్మ పాటలు పాడారు. - అక్షరశక్తి, హనుమకొండ

GUEST COLUMN

అసమాన విద్యా దీప్తి, ఆధ్యాత్మిక చైతన్యం

డాక్టర్ దహగాం సాంబమూర్తి గారి ఇష్టమైన సేవాగాథ : 84వ జన్మదిన శుభాకాంక్షలు





- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

గురుశిష్యుల బంధం ఒక పవిత్రమైన వారధి. నేను 1981లో వరంగల్ జిల్లా, హన్మకొండలోని ప్రభుత్వ కాంప్రహెన్సివ్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ లో బి.ఇ.డీ చదువుతున్నప్పుడు, నా జీవితాన్ని దిశానిర్దేశం చేసిన నా ప్రియమైన గురువు డాక్టర్ దహగాం సాంబమూర్తి గారు. వారు 84 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వారి జీవిత ప్రస్థానాన్ని, విద్యా, ఆధ్యాత్మిక, రచనా రంగాల్లో వారి చేసిన విశేష సేవలను స్మరించుకొంటున్న ప్రతి సందర్భంలోనూ ఒక విద్యార్థిగా నాలో కృతజ్ఞతా భావం ఉప్పొంగుతోంది. ఇప్పటికీ వారికి నా పైన అపారమైన దయ, పుత్ర వాత్సల్యం ఉంది.

బాల్యం నుండి విద్యావ్యాప్తి వరకు:
వారు 1942 అక్టోబర్ 12న కరీంనగర్ జిల్లా (ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా) మహదేవ్‌పూర్లో జన్మించిన వారు, ప్రాథమిక విద్యను సొంత ఊరిలోనే పూర్తి చేశారు. తరువాత స్నాతకోత్తరం (ఎం.ఎ. తెలుగు - 1970, ఎం.ఎడ్ - 1979, పి.హెచ్.డి - 1988) చేసి, విద్యారంగంలో ఉన్నత శిఖరాలను చేరుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టా పొందిన వారు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో 1960లో ప్రాథమిక ఉపాధ్యాయుడిగా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు.

ఉద్యోగ జీవితం - విద్యార్థులకు దీపస్తంభం:
డాక్టర్ సాంబమూర్తి గారి ఉద్యోగ జీవితం ఒక విద్యార్థి నుండి ప్రొఫెసర్ వరకు సాగిన ప్రయాణం. కరీంనగర్, హైదరాబాద్, వరంగల్, భద్రాచలం (ఐటీడీఏ) ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ముఖ్యంగా, వరంగల్ ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యా కళాశాలలో ప్రధానాచార్యులుగా, ప్రొఫెసర్ గా 2000 సంవత్సరంలో పదవీ విరమణ చేశారు. అంతటితో ఆగకుండా, 2001 నుండి 2008 వరకు వివిధ విశ్వవిద్యాలయాల్లో (కాకతీయ, ఉస్మానియా, నాగార్జున, హెచ్.ఎం.డి.ఎ) విజిటింగ్ ప్రొఫెసర్ గా, ప్రధానాచార్యులుగా సేవలందించారు. ఉద్యోగ జీవితంలో భాగంగా 1975లో కరీంనగర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని, 2019లో మధురీదాస్ ఫౌండేషన్ ఉత్తమ విద్యావేత్త పురస్కారాన్ని అందుకున్నారు. ఇటీవల హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్తు వారి "విశిష్ట సాహితీ



పురస్కారాన్ని అందుకున్నారు.

రచనలు - తెలుగు భాషకు అమూల్య సేవ:
ఆచార్యులు ఒక గొప్ప రచయిత, విమర్శకుడు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలకు, వివిధ విశ్వవిద్యాలయాలకు పాఠ్యపుస్తకాల రచనలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా ఎస్.ఈ.ఆర్.టీ., ఆర్. ఎం.ఎస్.ఏ. వంటి సంస్థల కోసం తెలుగు భోధన పద్ధతులు, వ్యాకరణం, భాషా సాహిత్యాలపై అనేక గ్రంథాలను రచించారు. "తెలుగు భోధన పద్ధతులు", "భాషా సాంకేతిక పరిజ్ఞానం", "మాతృభాషా విద్య - బోధనాభ్యసన శాస్త్రం" వంటి వారి రచనలు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు మార్గదర్శకాలు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తరపున 1-10 తరగతుల తెలుగు వాచకాలకు సంపాదకత్వం వహించడం వారికి తెలుగు భాషా పట్ల ఉన్న అపారమైన ప్రేమకు నిదర్శనం. 2023లో వారి స్వీయ చరిత్ర "మూర్తిమాట" ప్రచురితమైంది.

ఆధ్యాత్మిక భావం, సామాజిక సేవ:
వృత్తిరంగంలో ఉన్నత స్థాయికి చేరుకున్నప్పటికీ, వారి జీవితంలో ఆధ్యాత్మికతకు ఎంతో ప్రాధాన్యం ఉంది. శ్రీ రామచంద్ర మిషన్, శ్రీ అరవింద సొసైటీ, దివ్య జీవన సమాజ్ వంటి సంస్థలతో అనుబంధం కలిగి ఉన్నారు. రామకృష్ణ మఠం, శ్రీరామచంద్ర మిషన్ కు సేవలందించారు. ఉపాధ్యాయుల కోసం, విద్యార్థుల కోసం ఎన్నో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు.

కృతజ్ఞతా భావం:
నా లాంటి వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపిన డాక్టర్ దహగాం సాంబమూర్తి గారు, నాకు కేవలం బి.ఇ.డీ లో గురువు మాత్రమే కాదు; జీవిత పాఠాలు నేర్పిన ఆదర్శం. విద్య, ఆధ్యాత్మికం, రచనలు, సేవ అనే నాలుగు కోణాల్లో వారు చేసిన కృషి అనంతం. వారి 84వ పుట్టినరోజు సందర్భంగా వారికి తన శిష్యుల పట్ల ఉన్న వాత్సల్యాన్ని, ప్రేమను గుర్తు చేసుకొంటూ, ఆ మహనీయునికి పాదాలకు శతాధిక నమస్కారాలు సమర్పించుకొంటూ. వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ మాపై ఇలాగే ఎప్పటికీ ఉండాలని, వారు అష్టైశ్వర్యాలతో ,సుఖసంతోషాలతో, సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలనీ ఆ ఈశ్వరుడిని భక్తితో వేడుకుంటున్నాను.
వారి శిష్య పరమాణువు.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.